క్లుప్తంగా

'గ్రీవెన్స్'కు విశేష స్పందన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించారు. మరికొన్ని వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



బీవీకే కళాశాల వద్ద నిరీక్షిస్తున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థులు

సీతంపేట: ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంస్కృతం, తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడంతో సందడిగా కనిపించాయి. స్థానిక బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి.

ఉచిత వైద్య శిబిరం నేడు

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో 25వ వార్డు సీతంపేటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

త్వరితగతిన రోడ్డు విస్తరణ

సీతమ్మధార: రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఎస్ఈ సత్యనారాయణరాజు సూచించారు. 24వ వార్డులో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. సత్యం జంక్షన్ నుంచి సీత్మమధార అల్లూరి సీతారామరాజు కూడలి వరకు జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



51వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని కళింగనగర్‌లో శనివారం లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్ల వద్ద ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు అందిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి కార్పొరేటర్ చురుగ్గా పింఛన్లు పంపిణీ చేశారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో కె.కె.రాజు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, పద్మారెడ్డి, గోవింద్

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా.. నిస్వార్థంగా అందించడంలో వార్డు వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధి 14, 24, 25 వార్డులకు సంబంధించిన వలంటీర్లకు నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపంలో శనివారం సేవా వజ్ర, రత్న, మిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజాము నుంచే పింఛన్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని చెప్పారు. రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎటువంటి అవినీతి జరగకుండా పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తున్న వలంటీర్లపై టీడీపీ, జనసేన, బీజేపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉంటుందని చెప్పారు.

కోట్ల రూపాయలతో 'ఉత్తర' అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్ కోట్ల రూపాయల పెట్టుబడులతో ఉత్తర నియోజకవర్గం సస్యశ్యామలం కాబోతుందని కె.కె.రాజు అన్నారు. పెద్ద పెద్ద సంస్థలు వస్తున్నాయన్నారు. గతంలో ఇక్కడ ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉత్తర నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. సీఎస్సార్ ఫండ్ రూ.34.76 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేసినట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాయమాటలతో ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. అనంతరం వలంటీర్ల సేవలకు సెల్యూట్ చెబుతూ కె.కె.రాజు వారిని అభినందించారు. సేవా పురస్కారాలు ప్రదానం చేసి శాలువాలతో సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో 24, 14, 25 వార్డుల కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, కె.అనిల్‌కుమార్‌రాజు, సారిపిల్లి గోవింద్, కర్రి మురళీకృష్ణారెడ్డి, జి.వి.రమణి, ఏపీడీ దుర్గాప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు, సీవోలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారంతో సేవలకు గుర్తింపు



ఐదేళ్లుగా నేను చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా మిత్ర పురస్కారంతో సత్కరించడం ఆనందంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఐదు గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తాను. నా క్లస్టర్‌లో లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నాను.

– కొల్లి ఉదయభాస్కర్‌రెడ్డి, వలంటీర్, 24వ వార్డు

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు



ఐదేళ్లుగా అందిస్తున్న సేవలకు సేవా మిత్ర పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. కరోనా సమయంలో ఎన్నో సేవలు చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.

– బొదిరెడ్డి రమణి, వలంటీర్, 24వ వార్డు

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత



సేల్ డీడ్స్ అందుకున్న లబ్ధిదారులతో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



45వ వార్డులో రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ

సీతంపేట: ప్రభుత్వం మంజూరు చేసిన సెంటు స్థలంపై పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి సేల్ డీడ్స్ అందజేస్తున్నామని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. సీతంపేట కూడలిలోని పార్టీ కార్యాలయంలో శనివారం వార్డు పరిధిలోని 5 సచివాలయాల్లో ఉన్న 30 మంది లబ్ధిదారులకు సేల్ డీడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని విధంగా రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. రిజిస్ట్రేషన్ వల్ల ఆస్తి విలువ పెరుగుతుందని, బ్యాంకు లోన్ సదుపాయం కూడా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు వేణు, సంతోషి పాల్గొన్నారు.

అర్హులందరికీ సొంతిళ్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వాసుదేవ నగర్ కాలనీ 256 సచివాలయంలో జగనన్న గృహాల లబ్ధిదారులకు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు అందజేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరిన్ని కొత్త పథకాలు రావాలన్నా.. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను, ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, నేపాల్ శ్రీను, బాబూరావు, మాత ఈశ్వర్, మహేష్, గోవింద్, ప్రభాకర్, పోతల శ్రీను, వార్డు సీవో రమణి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.21.78 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయం హుండీ ఆదాయ లెక్కింపు శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు టి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. 28 రోజులకుగాను రూ. 21.78 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 357 మిల్లీగ్రాములు, వెండి 168 గ్రాముల 300 మిల్లీగ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి. బోశన్ తెలిపారు. శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్.ప్రసాద్ ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడిపై విచారణ



అక్కయ్యపాలెం వేణుగోపాలస్వామి ఆలయంలో విచారణ చేస్తున్న ఏసీ శిరీష

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకుడు పి.వి.అప్పలాచార్యులుపై వచ్చిన అభియోగాలపై దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శిరీష శనివారం ఆలయంలో కమిటీ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. కార్తీక మాసంలో ఆకాశదీపం పెట్టలేదని, అష్టోత్తర పూజా నామాలు చెప్పక పోవడం, పూజ చేసేటప్పుడు వైదికమంత్రాలు బయటకు చెప్పకపోవడం, మద్యం తాగి పూజాదికాలు చేస్తున్నారని భక్తులు నుంచి వచ్చిన ఆరోపణలపై సంజాయిషీ అడగ్గా.. సమాధానం చెప్పకుండా అర్చకుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంతలో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారని అతని కుటుంబ సభ్యులు వాట్సాప్ ద్వారా అబద్ధపు ప్రచారం చేశారు. అర్చకుడు అప్పలాచార్యులు ప్రస్తుతం ఇంట్లో క్షేమంగా ఉన్నారు. బెదిరింపు చర్యలకు పాల్పడి, విచారణ నిరోధించడానికి ప్రయతిన్ంచారని, జరిగిన సంఘటనపై నివేదిక పూర్తిగా ఉన్నతాధికారులకు అందజేస్తామని శిరీష తెలిపారు. ఆలయ చైర్మన్ వై.దేముడు, ధర్మకర్తలు చంద్రకళ, హరినాథ్, సుబ్బలక్ష్మి, సూర్యకళ, శ్యామల ఈవో పి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత



కుటుంబ సభ్యులకు వృద్ధురాలిని అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ

సీతమ్మధార: తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిన వృద్ధురాలిని ఆమె కుటుంబ సభ్యులకు ట్రాఫిక్ ఉమెన్ ఎస్ఐ వాణిశ్రీ అప్పగించారు. వివరాలిలా.. అక్కయ్యపాలెం హైవేలోని సాయిబాబా మందిరం వెనుక ప్రాంతంలో నివసిస్తున్న జి.సింహాచలం అనే వృద్ధురాలు శనివారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి నరసింహనగర్ రైతుబజారు వద్ద కూర్చుని కుప్పకూలిపోయింది. స్థానికులు గమనించి 108లో కేజీహెచ్‌కు తరలించారు. హాస్పిటల్ సిబ్బంది పోలీసులకు ఎంఎల్‌సీ ద్వారా సమాచారం ఇచ్చారు. ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ వద్ద ఉన్న సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు వృద్ధురాలిని అప్పగించారు.

కృష్ణా కాలేజీలో మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న పోలా భాస్కర్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కరావు చేతుల మీదుగా మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎన్ఆర్‌సీలుగా గుర్తింపు పొందాలన్నారు. కళాశాల అధ్యాపకులు కంటెంట్ అభివృద్ధి కోసం వీటిని ఉపయోగించాలని సూచించారు. దృశ్య శ్రవణ విధానంలో అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధిస్తారన్నారు. వాటిని కళాశాల యూట్యూబ్ ఛానల్‌లో వీక్షణ ద్వారా విద్యార్థులు ఎప్పుడైనా చూడగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ తదితరులు పాల్గొన్నారు.

'మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్'పై సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో శనివారం మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో మెటీరియల్స్ అండ్ టెక్నాలజీల వినియోగం అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ, ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ చాప్టర్ విశాఖ ప్రాంతీయ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఐఐటీ మద్రాసు సివిల్ ఇంజినీరింగ్ విభాగ విశ్రాంత ఆచార్యుడు రాజగోపాల్ స్థిరమైన నిర్మాణాల కోసం జియోసింథటిక్స్ వినియోగం గురించి తెలియజేశారు. స్ట్రీజా గ్లోబల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బి.వి.నాగరాజ్ కుమార్ అల్ట్రాటెక్ సిమెంట్ ఏజీఎం (టెక్నికల్) కె.వెంకట రామన్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

రైల్వే స్టేషన్‌లో మద్యం సీజ్



మద్యం బాటిళ్లు, నిందితుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని గుర్తించి, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. విశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ వి.బాలాజీరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హెచ్.డి.శర్మ సిబ్బందితో కలిసి శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఐదో నంబర్ ప్లాట్‌ఫాంపై మరిడి రాజు అనే వ్యక్తి 32 మద్యం బాటిళ్లు అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం



విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశాలతో సమావేశమైన వైద్యాధికారి సుధీర్



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సిద్ధం చేసిన వ్యాక్సిన్ క్యారియర్స్

సీతంపేట: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యూపీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్ తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో 13 బూత్‌లను సిద్ధం చేశామని, ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. 0 నుంచి 5 ఏళ్ల పిల్లలకు ప్రతి ఒక్కరూ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలన్నారు. ప్రతి బూత్‌లో ఏఎన్ఎం, ఆశా, ఇద్దరు వలంటీర్లు ఉంటారని, సోమ, మంగళవారాలు ఇంటింటా సర్వే జరుగుతుందని చెప్పారు. ఆదివారం నాడు పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వేస్తారని తెలిపారు. ఈ సర్వే కోసం 26 టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

నరసింహనగర్ యూపీహెచ్‌సీలో..

జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 సచివాలయాలతోపాటు యూపీహెచ్‌సీలో మొత్తం 13 బూత్‌లు ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి మనోజ్ తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి ఏఎన్ఎం, ఆశా, వలంటీర్లు అందుబాటులో ఉంటారన్నారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే కోసం 48 బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

విజయవంతం చేయాలని ర్యాలీ

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



సత్యం జంక్షన్‌లో చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

సీతమ్మధార: పాత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం సత్యం జంక్షన్‌లో ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు సమక్షంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవ్ చేసే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బిర్లా జంక్షన్‌లో..

మద్రిపాలెం: రోడ్ల మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రహదారి బిర్లా జంక్షన్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖ పాత్ర బీపీవో సంస్థ సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ అవగాహన కలిగిన వారికి పోలీసులు బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, శాంతిభద్రతల సీఐ భాస్కరరావు, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలను విస్తరిస్తాం



50వ వార్డులో కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, అధికారులు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సాయిరామ్ నగర్, సత్యానగర్ ప్రాంతాల్లో స్థానికుల విజ్ఞప్తి మేరకు కాలువను విస్తరించాలని, ఎస్ఈ దృష్టిలో పెట్టామని కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తెలిపారు. శనివారం ఎస్ఈ, ఇతర అధికారులతో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, రఘు, వార్డు నాయకులు రామారావు, సబ్బవరపు శ్రీను, రాంబాబు, లోవరాజు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'బౌద్ధ విజ్ఞానం – లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజధమ్మా తదితరులు

సీతంపేట: ఆచార్య కె.ఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం – లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ముఖ్య అతిథి బిఖ్ఖు రాజధమ్మా(మయన్మార్) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాది అనే స్వార్థాన్ని ప్రతి ఒక్కరూ వీడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం విస్తరించి ఉందని చెప్పారు.

రచయిత కె.ఎస్.చలం మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు, బుద్ధుడి జీవితంతో పెనవేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. బౌద్ధంపై పరిశోధనల కోసం బుద్ధ విజ్ఞాన కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనేక పుస్తకాలు, పరిశోధన గ్రంథాలను పరిశీలించి ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. సభాధ్యక్షుడు ప్రొఫెసర్ వి.వెంకటరావు మాట్లాడుతూ బౌద్ధ మతానికి ఈ పుస్తకం ఒక నిఘంటువుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ ముత్యాలనాయుడు, ఆచార్య చందు సుబ్బారావు, ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి, మాటూరి శ్రీనివాస్, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఎస్.హనుమంతరావు, పి.శ్యాంసుందర్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తుల మధ్య వారధి భాష

ఏయూక్యాంపస్: వ్యక్తుల మధ్య వారధిగా భాష నిలుస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో ఏయూ టీడీఆర్ హబ్, తెలుగుమల్లి(ఆస్ట్రేలియా) సంయుక్తంగా శనివారం నిర్వహించిన ప్రవాస సాహిత్యం రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో అన్ని భాషలకు ప్రాధాన్యం, ప్రాముఖ్యత కల్పిస్తున్నారన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.సీతామాణిక్యం మాట్లాడుతూ సదస్సులో భాగంగా 130 పరిశోధన పత్రాలను ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ విధానంలో సమర్పించారన్నారు. అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలపై నిర్వహించిన సదస్సులో విశేషమైన చర్చలు జరిపి జ్ఞానాన్ని పెంచుకోవడం మంచి పరిణామమన్నారు. తెలుగుమల్లి అధ్యక్షుడు కె.మల్లికేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంతో ఘనంగా అంతర్జాతీయ సదస్సును నిర్వహించిందని ప్రశంసించారు. సదస్సులో పాల్గొన్న వారికి రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.